క్లుప్తంగా

గవరపేట గౌరమ్మకు సారె సమర్పణ


గౌరమ్మకు పిండి వంటలతో సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో గవరపేటలో ఏర్పాటు చేసిన గౌరమ్మకు ఆదివారం రాత్రి పిండి వంటలతో చేసిన సారెను సమర్పించారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారికి తయారీ చేసిన బూరెలు, రవ్వ లడ్డూ, కాజా తదితర స్వీట్లతో పాటు పండ్లను తలపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మాకవరపాలెం: స్థానిక ఉన్నత పాఠశాల 1987–88 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కేజీబీవీ పాఠశాల సమీపంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఈ సమ్మేళనంలో వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

దేవాలయ వ్యవస్థ పరిరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న సత్యనారాయణ

కె.కోటపాడు : దేవాలయ వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఓలేటి సత్యనారాయణ అన్నారు. కె.కోటపాడు రావాలమ్మ ఆలయ ప్రాంగణంలో కె.కోటపాడు, దేవరాపల్లి, సబ్బవరం మండలాలకు చెందిన సనాతన ధర్మ కార్యకర్తలతో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయాల్లో దేవుడికి సమర్పించిన సొమ్మును హిందూ ధర్మ ప్రచారానికి, సేవలకు ఖర్చు చేయాలని ఆయన కోరారు. వీటి పరిరక్షణకు జనవరి 25న విజయవాడలో హైందవ శంఖారావం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాలకు చెందిన ధర్మ ప్రచారక్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరనారాయణం పాఠశాల విద్యార్థుల ప్రతిభ

మాడుగుల: బాలలు దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ సమీపంలోని నంబారు పాఠశాలల్లో జరిగిన రాష్ట్ర స్థాయి అంతర పాఠశాలల పోటీల్లో వీరనారాయణం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. ఫ్యాన్సీ డ్రెస్ విభాగంలో తృతీయ బహుమతి, పర్యావరణాన్ని కాపాడండి అన్న అంశంలో కన్సోలేషన్ బహుమతి దక్కించుకున్నారు. విద్యార్థులతో పాటు వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులు దీనాకుమారి, సుజాతను పాఠశాల హెచ్ఎం బి.వి.జగన్నాథరావు, స్కూల్ యాజమాన్య కమిటీ సభ్యులు అభినందించారు.

'పడాల'కు ఘన సన్మానం


మాడుగులలో పడాల కొండలరావును సన్మానిస్తున్న పార్టీ నాయకులు

మాడుగుల రూరల్: కాంగ్రెస్ పార్టీ మాడుగుల నియోజకవర్గ ఇన్చార్జిగా నియమితులైన పడాల కొండలరావును ఆదివారం మాడుగుల చర్చిలో సన్మానించారు. నియోజకవర్గ పార్టీ యూత్ అధ్యక్షుడు ఏసురాజు ఆధ్వర్యంలో మహిళలు, నాయకులు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిల్లా అప్పారావు, పుట్టా అమరయ్యగుప్తా, తదితరులు పాల్గొన్నారు.


ఖరీఫ్ సాగుకు క'న్నీటి' కష్టాలు

- తాండవలో నిండుగా నీరున్నా శివారుకు అందని పరిస్థితి
- కాలువలో తొలగించని పూడిక
- పొట్ట దశలో నీరందకపోతే తగ్గనున్న దిగుబడులు


ములగపూడిలో నీరు లేక ఉన్న వరి చేను


నాతవరం వద్ద కాలువను కప్పేసిన పూడిక (ఇన్సెట్)తాండవ ప్రాజెక్టులో నిండుగా నీరు

నాతవరం: ఖరీఫ్ సాగు రైతులను నీటి కష్టాలు వీడడం లేదు. తాండవ రిజర్వాయరులో పుష్కలంగా నీరు ఉన్నా అందని పరిస్థితి నెలకొంది. కాలువలో పూడిక తీయకపోవడంతో శివారు ఆయకట్టు వరకు నీరు ప్రవహించడం లేదు. ఖరీఫ్ సీజన్‌లో ప్రతి ఏటా తాండవ ప్రాజెక్టు నీరుపై ఆధారపడి రెండు జిల్లాల పరిధిలో సుమారుగా 52 వేలు ఎకరాల్లో వరి పంట సాగు చేస్తుంటారు. ఈ ఏడాది ప్రకృతి కరుణించడంతో సకాలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి నాట్లు వేశారు. ఏటా ఆయకట్టుకు నీరు ప్రవహించే తాండవ కాలువలో అధికారులు పూడిక తొలగించి శుభ్రం చేసేవారు. అలాంటిది కూటమి ప్రభుత్వం తాండవ కాలువలో ఎక్కడ కూడా పూడిక పనులు చేపట్టలేదు. పిచ్చి మొక్కలు, చెట్ల కొమ్మలతో కాలువ కుదించుకుపోయింది. తాండవ ప్రాజక్టు నుంచి ఆయకట్టకు నీరు ప్రవహించేందుకు కుడి ఎడమ రెండు పెద్ద కాలువలు ఉన్నాయి. తాండవ ఆయకట్టు అనకాపల్లి జిల్లాలో నాతవరం, కోటవురట్ల, నర్సీపట్నం మండలాలతో పాటు కాకినాడ జిల్లా కోటనందూరు రౌతులపూడి మండలాల పరిధిలో 52 వేలు ఎకరాలకు పైగా వ్యాప్తించి ఉంది. ఆయా భూములకు సాగు నీరు అందించేందుకు పెద్దా చిన్న కాలువలు కలుపుకొని మొత్తం 120 కిలో మీటర్ల పొడవున ఉన్నాయి. ఆ కాలువల్లో పూడిక తీయకపోవడంతో తాండవ ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉన్నా శివారు ఆయకట్టు భూములకు నీరు ప్రవహించడం లేదని కోటవురట్ల, నర్సీపట్నం కోటనందూరు మండలాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోటనందూరు మండలం కాకరపల్లి, అల్లిపూడి, కోటవురట్ల మండలం పాములవాక, బోడపాలెం, నర్సీపట్నం మండలం వేములపూడి, మొండికండి, బలిఘట్టం చెందిన రైతులు కాలువలో కొంత మేర శ్రమదానంతో పూడిక పనులు చేపట్టారు. ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు కురియడంతో తాండవ ప్రాజెక్టు నీరు అంతంత మాత్రంగా ప్రవహించినా ఇప్పటి వరకు సమస్య రాలేదు.


ప్రధాన కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా కొమ్మలు

ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉన్నందున ఈ సమయంలో కచ్చితంగా నీరు అవసరం ఉంటుంది. ఆశించిన విధంగా నీరు లేకపోతే ధాన్యం దిగుబడి తగ్గిపోతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రాజెక్టులో నీటి మట్టం బాగుంది కాబట్టి శివారు ఆయకట్టుకు నీరు అందించేలా చేయాలని కోరుతున్నారు.

ఆశించిన స్థాయిలో నీటి ప్రవాహం లేదు..



గతంతో పోల్చుకుంటే ఖరీఫ్ సీజన్‌కు ఈ ఏడాది వర్షాలు బాగా కురిశాయి. కాలువలో పూడిక కారణంగా శివారు ఆయకట్టు వరకు నీరు ప్రవహించడం లేదు. ప్రస్తుతం వరి చేను పొట్ట దశలో ఉంది. ఈ సమయంలో పుష్కలంగా నీరు ఉంటే ఆశించిన విధంగా దిగుబడులు వస్తాయి. లేకుంటే తగ్గిపోతుంది. అధికారులు స్పందించి పూడిక తీత చేపట్టాలి.

శిరుసుపల్లి శేఖర్ ఎం.బెన్నవరం

సమస్యలపై ఏకరువు

- చోడవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం

చోడవరం: వివిధ శాఖల సమస్యలు, అధికారుల తీరుపై మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఏకరువు పెట్టారు. చోడవరం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ గాడి కాసు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఎంపీడీవో అంజనేయులు వార్షిక నివేదికను చదివి వినిపించారు. అనంతరం వివిధ శాఖ అధికారులు ఆయా శాఖల పనితీరుపై నివేదికను సభ ముందుంచారు. విద్య, రెవెన్యూ, ఇరిగేషన్, ఎలక్ట్రికల్, ఎన్ఆర్ఈజీఎస్ శాఖల పనితీరుపై ప్రధానంగా సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. చోడవరం గవర్నమెంటు హైస్కూల్‌కు పూర్తి స్థాయిలో ప్రహరీ నిర్మించాలని, తిమ్మన్నపాలెం ఎంపీపీ స్కూల్ శ్లాబ్‌కు మరమ్మతులు చేపట్టాలని సభ్యులు కోరారు. చోడవరం పట్టణంతో పాటు చాలా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోందని, లో ఓల్టేజీ సమస్య వల్ల గృహోపకరణాలు దెబ్బతింటున్నాయని, పలు చోట్ల తీగలు కిందికి వాలిపోయి ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. సబ్‌స్టేషన్‌లో కాల్ సెంటర్ నుంచి సరైన సమాధానం రావడం లేదంటూ పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు విద్యుత్ శాఖ అధికారులను నిలదీశారు. సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు సమాధానమిచ్చారు. నర్సయ్యపేట రెవెన్యూ పరిధిలో తనకు సంబంధం లేని ఎల్‌పీసీ పట్టా భూవివాదంపై తనకు నోటీసు ఇవ్వడం ఏమిటని గాంధీ గ్రామం సర్పంచ్ గాడి అప్పారావు రెవెన్యూ అధికారులను నిలదీశారు. దీనిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రామారావు చెప్పారు. చోడవరంతో పాటు పలు గ్రామాల్లో మంచినీటి సమస్య ఎక్కువగా ఉందని సభ్యులు చెప్పడంతో సమావేశంలో ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు సమాధానం ఇస్తూ మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మండల పరిషత్ నిధులతో మంచినీటి సమస్య పరిష్కారానికి, అవసరమైన చోట్ల కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ఖర్చు చేస్తామన్నారు. గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్లు, కాలువలు, ఇతర అభివృద్ధి పనులు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడతామన్నారు. బోర్‌వెల్స్ కొనుగోలుకు రూ.5లక్షలు నిధులు కేటాయించడం, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టబోయే పనులు, ఖర్చులు, ఆదాయం అంచనా బడ్జెట్‌పై తీర్మానం చేశారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు బైన ఈశ్వరరావు, గంగరాజు, మండల పరిషత్ సూపరింటెండెంట్ అమ్మాజి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అధికారుల అలసత్వం

- బుచ్చెయ్యపేట మండల పరిషత్ సమావేశంలో సభ్యుల ఆగ్రహం
- ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాలన్న ఎమ్మెల్యే రాజు


మండల సమావేశంలో మంచినీటి పనులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నేతలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట: అభివృద్ధి పనుల విషయంలో అధికారులు ఆలసత్వం వహిస్తున్నారంటూ మండల ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం బుచ్చెయ్యపేట మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశ జరిగింది. గత ప్రభుత్వంలో ఇంటింటి కుళాయి ద్వారా మంచినీరు అందించాలని కోట్లాది రూపాయలు నిధులు విడుదల చేశారని సభ్యులు గుర్తు చేశారు. కాంట్రాక్టర్ ఈ పనులన్నీ పూర్తి చేయకుండా వదిలేయడంతో మంచినీరు సంక్రమంగా అందక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని చింతపాక, దిబ్బిడి, పోలేపల్లి, వడ్డాది, గున్నెంపూడి, విజయరామరాజుపేట, కేపీ ఆగ్రహారం, కందిపూడి తదితర గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఉమామహేశ్వరరావును నిలదీశారు. మండలంలో గోకులం షెడ్లు అందరికి ఇస్తామని చెప్పారని, ఇప్పుడు కనీసం మండలంలో ఎవరికి ఇస్తున్నారో అధికారుల వద్ద వివరాలు లేకపోవడంపై జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి తదితరులు ఏపీవో వరహాబాబుపై మండి పడ్డారు. గంటికొర్లాం గ్రామ పంచాయతీలో సుమారు రూ.పది లక్షలు నిధులు పనులు చేయకుండానే డ్రా చేసి దుర్వినియోగం చేసిన టీడీపీ సర్పంచ్ కుమారుడు బాబూరావుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, అయినా దీనిపై విచారణ చేపట్టడం లేదంటూ మాజీ సర్పంచ్ శనివాడ నాయుడు బాబు ఈవోపీఆర్డీ విజయలక్ష్మిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిధులను కాపాడాల్సిన అధికారులే నిధులు దుర్వినియోగం చేసిన వారికి కొమ్ముకాయడమేంటని ప్రశ్నించారు. పలు సమస్యలపై ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. పార్టీలకు అతీతంగా సర్పంచ్, ఎంపీటీసీ, మండల నాయకులకు అధికారులు గౌరవం ఇవ్వాలని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు సూచించారు. త్వరలో బీఎన్ రోడ్డు, గున్నెంపూడి రోడ్డు పనులు, ఇంటింటి కుళాయి పనులతో పాటు ఇతర అభివృద్ధి పనులు ప్రారంభిస్తానని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ లక్ష్మి, డీఈ మోహన్, ఎస్ఐ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష


భిక్ష స్వీకరిస్తున్న అయ్యప్ప స్వాములు

రోలుగుంట: స్థానిక కాశీవిశ్వేశ్వర మృత్యుంజయ ఆలయం వద్ద ఆదివారం అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. గురుస్వామి చింతకాయల తాతబ్బాయి పీఠం వద్ద స్వామికి పూజలు చేశారు. కొవ్వూరు, నాయుడుపాలెం గ్రామాలకు చెందిన అయ్యప్పస్వాములు ఈ పూజలో పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ


పేదలకు దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామంలో ఆదివారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన విశ్రాంతి ఉద్యోగి పాలకుర్తి మోహన్ రావు ఆయన భార్య కుసుమ జ్ఞాపకార్థం 67 మందికి వార్డు సచివాలయ కార్యదర్శి జి.నాగేశ్వరరావు వీటిని అందజేశారు.

బోరు ప్రారంభం


బోరును ప్రారంభిస్తున్న నాసా సంస్థ ప్రతినిధి

నాతవరం: గుమ్మడిగొండ పంచాయతీ శివారు చిన్న జగ్గంపేట గ్రామంలో నాసా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేతి బోరును ఆదివారం అ సంస్థ ప్రతినిధులు రాజాకులపతి, మైక్‌వైజరు ప్రారంభించారు. గిరిజనులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా చేతి బోరు ఏర్పాటు చేశామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాసా సంస్థ సామాజిక మండల కార్యకర్త తాటిపాక శ్రీను, దళిత జిల్లా నాయకుడు కొండ్రు మరిడియ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

104 సిబ్బంది వినతులు

మాడుగుల రూరల్: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 104 సిబ్బంది ఆదివారం పలువురు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా 104 సిబ్బంది యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.భార్గవ్ మండలంలో వంటర్లపాలెం, మాడుగుల, తదితర గ్రామాల సర్పంచ్‌లకు వినతులు ఇచ్చారు. తమ సమస్యలను ఈ నెల 30వ తేదీలోగా పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


చీడికాడ గ్రంథాలయంలో ప్రముఖుల చిత్ర పటాల వద్ద నివాళులర్పిస్తున్న పాఠకులు


కె.జె.పురం గ్రంథాలయంలో డిపాజిట్ సేకరణ రశీదులు అందిస్తున్న లైబ్రరీ సిబ్బంది శ్రుతి

చీడికాడ: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని చీడికాడ గ్రంథాలయాధికారి జోగేశ్వరి అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులు ఎస్.ఆర్.రంగనాథన్, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్యల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు.

సభ్యత్వ నమోదు

మాడుగుల రూరల్: కె.జె.పురం శాఖా గ్రంథాలయంలో డిపాజిట్ సేకరణ, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు గ్రంథాలయ అటెండర్ వి.శ్రుతి రశీదులు అందజేశారు.

విద్యార్థులకు కుర్చీ ఆటలు

మాకవరపాలెం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు కుర్చీ ఆటలు నిర్వహించారు. స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద ఆదివారం నిర్వహించిన కుర్చీ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. సోమవారం 10 గంటలకు క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయ అధికారి చంద్రకళ తెలిపారు. విజేతలకు ఈ నెల 20న బహుమతులు అందజేస్తామన్నారు.

బుచ్చెయ్యపేటలో డ్రాయింగ్ పోటీలు

బుచ్చెయ్యపేట: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుచ్చెయ్యపేటలో ఆదివారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చూపారు.

కె.కోటపాడు : పోటీ పరీక్షలతో విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యం వెలుగులోకి వస్తుందని చౌడువాడ శాఖా గ్రంథాలయాధికారి ఎం.పద్మావతి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం చౌడువాడ హైస్కూల్ విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఆకట్టునే విధంగా చిత్రాలను వేసిన విద్యార్థులను అభినందించారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

నర్సీపట్నం: వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ అధ్యాపకుడు జట్టి యలమంద మాట్లాడుతూ ప్రపంచంలో తెలుగు భాషకు మించిన భాష లేదన్నారు. సంగీతం వింటున్నప్పుడు ఎంత ఆనందం కలిగిస్తుందో తెలుగు భాష వింటున్నప్పుడు అంతే ఆనందం కలుగుతుందన్నారు. తెలుగు భాష గొప్పతనం గురించి విశ్వనాథ సత్యనారాయణ రచించిన పద్యాన్ని ఆయన ఆలపించారు. అనంతరం విద్యార్థులు వినిపించిన పద్యాలు, కవితలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ దమయంతి, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకరరావు, విద్యార్థులు, విశ్రాంత లైబ్రేరియన్లు జి.మురళీకృష్ణ, కె.త్రిమూర్తులు పాల్గొన్నారు.


బుచ్చెయ్యపేటలో గీసిన బొమ్మలను చూపిస్తున్న విద్యార్థులు


చౌడువాడ హైస్కూల్‌లో డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


నర్సీపట్నం గ్రంథాలయంలో మాట్లాడుతున్న విశ్రాంత అధ్యాపకుడు జట్టి యలమంద

భక్తులతో ధారమఠం కళకళ


ఆలయ ప్రాంగణంలో భారీగా వాహనాలు

గొలుగొండ: కార్తీక మాసం ఆదివారం కావడంతో పర్యాటకులు, భక్తులతో ప్రముఖ శైవక్షేత్రమైన ధారమఠం శివాలయం కిటకిటలాడింది. వందల సంఖ్యలో వాహనాలతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది. కుటుంబ సమేతంగా వచ్చి ఇక్కడే అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. విజయవాడ, రాజమండ్రి, విశాఖ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. జలపాతాల వద్ద స్నానాలు ఆచరించి పరమశివుడిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కృష్ణదేవిపేట ప్రాంతంలో ఉన్న అల్లూరి పార్కులో విద్యార్థులు సందడి చేశారు.

ఘనంగా సత్యసాయిబాబా జయంతి

దేవరాపల్లి: పెదనందిపల్లిలో భగవాన్ సత్యసాయి బాబా జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొని సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం కేక్ కట్ చేసి చిన్నారులకు, సత్యసాయి భక్తులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన బాలికల ఆధ్యాత్మిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రామానాయుడు, సత్యసాయి భక్తుడు రావాడ శశిభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.


సత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర బృందం

బుచ్చెయ్యపేట: ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించి కేంద్ర బృందం ఆదివారం మండలంలో కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. అంతకు ముందు చోడవరం మండలం దుడ్డుపాలెంలో ఆయిల్‌ఫామ్ మెగా ప్లాంటేషన్‌లో భాగంగా రైతు పి.శ్రీరామమూర్తికి చెందిన ఆయిల్‌ఫామ్ మొక్కలను పరిశీలించారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులు, శాస్త్రవేత్తలతో సమావేశమయ్యారు. ఆయిల్‌ఫామ్ సాగు విస్తీర్ణం పెంచాలని, తద్వారా రైతులు అధిక ఆదాయం సముపార్జించవచ్చునని కేంద్ర ఆయిల్‌సీడ్స్ సంయుక్త కార్యదర్శి అజితేకుమార్ సాహూ తెలిపారు. సోలార్ బోర్లను సబ్సిడీపై మంజూరు చేయాలని, బిందు సేద్యం పరికరాలపై రాయితీ ఇవ్వాలని పలువురు రైతులు ఆయనకు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ అధికారులు రణబీర్ సింగ్, కె.పోన్నుస్వామి, ఏపీ ఉద్యానవనశాఖ అదనపు డైరెక్టర్ బాలాజీ నాయక్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి జి.ప్రభాకర్‌రావు, జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారి జి.వి.లక్ష్మి, మాడుగుల, రావికమతం మండలాల ఉద్యానవన శాఖాధికారులు వి.భాను, పుష్పలీలావతి, ఆయిల్‌ఫామ్ సూపర్‌వైజర్లు, వీహెచ్ఏలు, వీఏఏలు పాల్గొన్నారు.


రైతులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న అజిత్‌కుమార్ సాహూ

ఘనంగా అయ్యప్ప పడి పూజ


అయ్యప్పస్వామి గీతాలు ఆలపిస్తున్న గురుస్వాములు

కె.కోటపాడు : గొండుపాలెం గ్రామంలోని అయ్యప్పస్వామి మందిరం వద్ద శనివారం రాత్రి పడి పూజ నిర్వహించారు. గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తులు ఈ పూజా కార్యక్రమాన్ని గురుస్వామి బండారు వెంకట రమణమూర్తి ఆధ్వర్యంలో జరిపారు. అయ్యప్ప, వినాయక, కుమారస్వామి, లక్ష్మీదేవి అమ్మవార్లకు పూజా కార్యక్రమాలతో పాటు అఖండ హారతి ఇచ్చారు. అనంతరం అయ్యప్పస్వామిపై ఆలపించిన భక్తి గీతాలతో పాటు శరణుఘోష మార్మోగింది. అనంతరం అయ్యప్ప మూల విరాట్ దర్శనాన్ని మాలధారులకు పడిమెట్లపై నుంచి కల్పించారు. ఈ పూజా కార్యక్రమంలో చౌడువాడ, ఎ.కోడూరు, గుల్లేపల్లి, బత్తివానిపాలెం, కింతాడ, సూదివలస, కె.సంతపాలెం, సింగన్నదొరపాలెం, సూర్రెడ్డిపాలెం, వారాడ గ్రామాలతో పాటు దేవరాపల్లి, చీడికాడ, చోడవరం మండలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపోత్సవం


దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ కాంతమ్మ, మహిళలు

రోలుగుంట: కొవ్వూరు గ్రామంలోని గౌరీపరమేశ్వరుల ఆలయం వద్ద ఆదివారం దీపోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ ప్రారంభించారు. మహిళలు 365 జ్యోతులతో దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ


కింతలి హైస్కూల్ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

మాడుగుల: మండలంలో కింతలి ఎంపీపీ, హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాలను ఆదివారం సర్పంచ్ మైచర్ల భవానీ, ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిరావు ఆవిష్కరించారు. కింతలి సపోర్టర్స్ కమిటీ సహకారంతో ఈ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అప్పాన నారాయణరావు, ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మోనటరీ కమిటీ సభ్యులు మరువాడ ఈశ్వరావు, ఎం.ఎం.దాసు, విగ్రహ దాత కుదర నాగేశ్వరరావు, సియ్యాద్రి శ్రీనివాసరావు, పాము సూర్యారావు, పెట్లా ఈశ్వరావు, వేచలపు సహదేవుడు, దళిత నాయకులు పాల్గొన్నారు.